సాక్షి నంద్యాల

మంగళవారం : 2 : జనవరి : 2024



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



రూ.5లక్షల విరాళం

డోన్ టౌన్: తత్వమసి అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన కెంచె అర్జున్ విరాళంగా రూ.5,16,016 అందజేశారు.



ఉంగరానిగుండ్లలో ఘర్షణ

డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందాడు. హైవేపై మృతుడి కుటుంబీకులు ఆందోళన చేశారు.

8లో▸

న్యూస్‌రీల్

యాగంటీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి వారికి సోమవారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ఏక శిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం అర్చన తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం శ్రీ ఉమామేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి, ఆలయ అర్చకులు సిబ్బంది ఉన్నారు.

నేడు మహానంది ధర్మకర్తల మండలి సమావేశం

మహానంది: మహానంది దేవస్థానంలోని కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. క్షేత్ర ఆవరణలో విద్యుత్ దీపాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

పాడి రైతులకు క్యారియర్ బాక్సుల పంపిణీ



బాక్సులను పంపిణీ చేస్తున్న నాగేశ్వర్‌రెడ్డి

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో పాడిరైతులకు విజయ డెయిరీ సుంకేసుల సహకార సంఘం డైరెక్టర్ మంచాల నాగేశ్వర్ రెడ్డి సోమవారం ఫ్యామిలీ క్యారియర్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కర్నూలు జిల్లా విజయ డెయిరీ పాల సహకార సంఘం చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలోని 50 మంది పాడి రైతులకు రూ.600 విలువ చేసే క్యారియర్ బాక్సులను పంపిణీ చేశామన్నారు.

ముదిమికి మూడువేల బలిమి

- వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.2750 నుంచి రూ.3,000కు పెంపు
- నేటి నుంచి పెరిగిన పింఛన్ల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 3,99,565 మందికి ప్రయోజనం
- కొత్తగా 6,545 మందికి పింఛన్లు
- జనవరి 8 వరకు ఊరూవాడా సంబరాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు



పొలంలో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్): పింఛన్ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నూతన' కానుక అందిస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000లకు పెంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మంది పింఛన్‌దారులకు పండుగ వచ్చినట్లు అయ్యింది. కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ అనే తారతమ్యం లేకుండా...లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులైతే చాలు నూతన పింఛన్ మంజూరు చేస్తుండటం విశేషం. వృద్ధులకు, వితంతువులకు, చేనేత, కల్లుగీత కార్మికులకు, మత్స్యకారులకు, ఒంటరిమహిళలకు, చర్మకారులకు, కళాకారులకు 2023 డిసెంబరు నెల వరకు రూ.2,750 ప్రకారం ప్రభుత్వం పింఛన్ చెల్లించింది. వీరందరికీ 2024 జనవరి 1 నుంచి రూ.3,000 పింఛన్ అందనుంది. పింఛన్ అందుకుంటున్న మిగతా వారిలో దివ్యాంగులు, ఇతరులు ఉన్నారు. వీరికి ఇప్పటికే రూ.3,000, ఆపైన పింఛన్ పొందుతున్నారు. పింఛన్ పెరగడంతో అవ్వాతాతలు, వితంతువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుతో కర్నూలు జిల్లాలో 2,10,839 మందికి, నంద్యాల జిల్లాలో 1,88,726 మందికి ప్రతి నెలా రూ.9,98,91,250 లబ్ధి చేకూరనుంది.

టీడీపీ హయాంలో ఇలా..

టీడీపీ హయాంలో పింఛన్ పొందాలంటే తల ప్రాణం తోకకు వచ్చేది. ఎప్పుడు ఇచ్చేవారో తెలిసేది కాదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రతి నెలా 15వ తేదీ వరకు లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రత్యేకంగా కొత్త పింఛన్లు ఇచ్చేవారు కాదు. లబ్ధిదారులు ఎవరైనా మరణిస్తేనే కొత్త వారికి అవకాశం వచ్చేది. జన్మభూమి కమిటీ ఆమోదం లేనిదే కొత్త పింఛన్ మంజూరయ్యేది కాదు. నాలుగైదు నెలల పింఛన్ మొత్తాన్ని లంచంగా ముట్టచెప్పాల్సి వచ్చేది. ప్రతి నెలా ఇచ్చే రూ. వెయ్యి పింఛన్‌లోనూ రూ.100 నుంచి రూ. 200 వరకు కోత పెట్టేవారు. ఒక్కో గ్రామానికి ఇన్నే పింఛన్లు అని కోటా పెట్టి అమలు చేసేవారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా..

టీడీపీ హయాంలో పింఛన్లు ఎలా తగ్గించాలా అనే కోణంలో ఆలోచిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులు ఏ ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకూడదనే లక్ష్యంతో పనిచేస్తోంది. అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తోంది. ఏడాదికి రెండుసార్లు నూతన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ప్రతి నెలా ఠంచన్‌గా వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చిగుడ్ మార్నింగ్ చెప్పి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నారు. టీడీపీ హయాంలో వృద్ధులు పింఛన్ పొందాలంటే 65 ఏళ్లు నిండాల్సి ఉంది. వేలాది మంది పింఛన్ కోసం ఎదురుచూస్తూ..మరణించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే పించన్ అర్హత వయస్సు 60కి తగ్గించారు. దీంతో వేలాది మంది వృద్ధులకు 60 ఏళ్ల నిండిన వెంటనే పింఛన్ లభిస్తోంది. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో 3,61,563 పింఛన్లు మాత్రమే ఉండేవి. వీటికి కేవలం రూ.40.27 కోట్లు మాత్రమే నగదు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023 సెప్టెంబరు నాటికి పింఛన్లు 4,71,561కు పెరిగాయి. టీడీపీ హయాంతో పోలిస్తే 1,09,998 మంది లబ్ధిదారులు పెరిగారు. పింఛన్ల కోసం పంపిణీ చేసే మొత్తం రూ.130.76 కోట్లకు చేరింది.



ఈ చిత్రంలో మహిళ పేరు పగిడాల వెంకటేశ్వరమ్మ. కృష్ణగిరి మండలం టి.గోకులపాడుకు చెందిన ఈమె భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. కుమారుడు కూడా తనువు చాలించడంతో ఈమెకు అండగా ఎవరూ లేరు. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌తో ఈమె జీవనం సాగిస్తోంది. పింఛన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచడంతో ఈమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు దూదేకుల సోఫీ సాహెబ్, ఊరు గడివేముల. నలుగురు సంతానం ఉన్నా కుటుంబీకుల నిరాదరణకు గురయ్యాడు. నిన్నటి వరకు వ్యవసాయ పనులకు వెళ్తూ బతుకీడుస్తున్నాడు. శరీరం సహకరించకున్నా వెళ్లాల్సిన పరిస్థితి. నేటి నుంచి వృద్ధాప్య పింఛన్, అందులోనూ రూ. 3 వేలు ఇస్తుండటంతో ఆనందానికి అవధుల్లేవు. జగన్ చేస్తున్న మేలును కొనియాడుతున్నాడు.



ఉమ్మడి జిల్లాకు 6,545 కొత్త పింఛన్లు

నూతన పింఛన్లు పంపిణీ చేసేందుకు 2023 నవంబరు నెల చివరి నాటికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రభుత్వం వెరిఫికేషన్ చేయించింది. ఇప్పటి వరకు వెరిఫికేషన్ చేసిన వాటిలో కర్నూలు జిల్లాకు 3,374, నంద్యాల జిల్లాకు 3,171 ప్రకారం మొత్తం 6,545 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. కొత్త పింఛన్ లబ్ధిదారులకు రూ.3,000 ప్రకారం పంపిణీ చేస్తారు. ఇదిలా ఉండగా..2023 జనవరిలో కర్నూలు జిల్లాకు 8,446, నంద్యాల జిల్లాకు 6843.. మొత్తంగా ఉమ్మడి జిల్లాకు 15,289 కొత్త పింఛన్‌లు మంజూరయ్యాయి. అలాగే సెప్టెంబరు నెలలో కర్నూలు జిల్లాకు 12,341, నంద్యాల జిల్లాకు 10,962 ప్రకారం ఉమ్మడి జిల్లాకు 23,303 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. మొత్తంగా 2023లో 38,303 కొత్త పింఛన్లు మంజూరు కావడం విశేషం.



పింఛన్ మొత్తం పెంపు ఇలా..

పింఛన్ల పంపిణీ షెడ్యూల్ మండలాల వారీగా..

జనవరి 2: ఆళ్లగడ్డ రూరల్, అర్బన్, డోన్, గడివేముల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, పాణ్యం, సంజామల

జనవరి 3: కల్లూరు, హాలహర్వి, మంత్రాలయం, గూడూరు రూరల్, అర్బన్, ఎమ్మిగనూరు రూరల్, అర్బన్, ఆలూరు, వెల్దుర్తి, ఆదోని అర్బన్, ఓర్వకల్లు, డోన్ అర్బన్, గోస్పాడు, కొత్తపల్లి, నంద్యాల అర్బన్, పాములపాడు, ప్యాపిలి, శిరివెళ్ల, వెలుగోడు

జనవరి 4: ఆదోని రూరల్, పత్తికొండ, కర్నూలు అర్బన్, నందవరం, కోడుమూరు, హొళగొంద, కోసిగి, బనగానపల్లె, బండిఆత్మకూరు, బేతంచెర్ల అర్బన్, జూపాడుబంగ్లా, నంద్యాల, అవుకు, రుద్రవరం

జనవరి5: చిప్పగిరి, పెద్దకడుబూరు, సి.బెళగల్, గోనెగండ్ల, ఆస్పరి, కృష్ణగిరి, ఆత్మకూరు అర్బన్, రూరల్, దొర్నిపాడు, మిడుతూరు

జనవరి6: కౌతాళం, కర్నూలు రూరల్, మద్దికెర, దేవనకొండ, పగిడ్యాల, శ్రీశైలం, ఉయ్యాలవాడ

జనవరి8: చాగలమర్రి, మహానంది, నందికొట్కూరు అర్బన్, రూరల్.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పింఛన్ లబ్ధిదారుల వివరాలు..

కర్నూలు జిల్లా	పింఛన్ రకం	నంద్యాల జిల్లా
1,28,196	వృద్ధాప్య	1,16,152
71,485	వితంతు	62,734
2,992	చేనేత	1,021
244	కల్లుగీత	233
5,907	ఒంటరి మహిళలు	4,303
825	మత్స్యకారులు	1,825
1,149	ట్రెడిషినల్ క్యాబలర్స్ (చెప్పులు కుట్టేవారు)	2,434
41	పెన్షన్ టు ఆర్టిస్ట్	24
2,10,839	మొత్తం	1,88,726

పండుగలా వారోత్సవాలు



పింఛన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కి పెంచడం, కొత్త పింఛన్‌లు మంజూరు కావడంతో జనవరి 8 వరకు వారోత్సవాలు పండుగలా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. కొత్త పింఛన్లు, పింఛన్ మొత్తం పెంపునకు సంబంధించిన పోస్టర్లు వచ్చాయి. వాటిని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాం. పింఛన్ పొందుతున్న వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలతో సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి సంతకంతో ఉన్న లేఖలను అందజేస్తాం.

– శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, వైఎస్ఆర్ క్రాంతిపథం, నంద్యాల జిల్లా

శిశువుకు ప్రాణం పోసిన 108



108లో చికిత్సతో బతికిన శిశువు

హొళగుంద: ఉమ్మనీరు తాగి అపస్మారక స్థితిలో ఉన్న శిశువుకు 108 వాహనం ప్రాణం పోసింది. నిండు గర్భిణి అయిన వందవాగిలి గ్రామానికి చెందిన లక్ష్మికి ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. కాన్పు కష్టం కావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయగా.. సిబ్బంది వచ్చి వాహనంలో ఆమెను హొళగుంద పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ మగ బిడ్డను జన్మనివ్వగా.. శిశువు ఉమ్మనీరు తాగి అపస్మారక స్థితిలో ఉండిపోయింది. వెంటనే ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎమ్టీ) యల్లయ్య, పైలెట్ వినోద్‌కుమార్ సహకారంతో లక్ష్మితో పాటు శిశువును ఆదోనికి 108లో తరలిస్తూ అందులోనే చికిత్స అందించారు. అంబులెన్స్‌లో ఉన్న ఆక్సిజన్ సహాయంతో శిశువుకు ఫీడింగ్ ట్యూబ్ పెట్టి మెరుగైన చికిత్స అందించి ఆదోని ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. శిశువుకు ప్రాణం పోసిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ బావుటా

జగనన్న దీవెనలతోనే ఉద్యోగం సాధించా



మా నాన్న మురళీ అనారోగ్యంతో కొన్నాళ్ల క్రితం మరణించారు. అమ్మ అరుణ నాతో పాటు ఇద్దరు సోదరులను కష్టపడి చదివించింది. నేను ఇంటర్‌కి వచ్చేలోగా ఇక ఖర్చులు భరించలేమని చదువు మానేద్దామని అనుకుంటుండగా అమ్మ ఒడి పథకంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. అదే ప్రోత్సాహంతో డిగ్రీలో చేరా. డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి విద్యా దీవెనతో చదువు కొనసాగిస్తూ వచ్చాను. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగానే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో టీసీఎస్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపిక అయ్యాను. నా చదువు మధ్యలో నిలిచిపోతుందని కుటుంబంలో అందరూ ఆందోళన చెందుతున్న తరుణంలో జగనన్న దీవెనతో ఉన్నత చదువులు పూర్తి చేయడం, ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. నా లాంటి ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు ఆదుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– శిరీష, నూనెపల్లె, నంద్యాల

మా కుటుంబానికి రూ. 4.50 లక్షల సాయం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఎంతో మేలు చేసింది. జగనన్న పాలనలో మా కుటుంబానికి దాదాపు రూ.4.50 లక్షలు సాయం అందింది. చాలా ఏళ్లుగా మేము పాత మిద్దెలోనే ఉన్నాం. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం, బిల్డింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. ఆ తర్వాత ఇల్లు కట్టుకునేందుకు సాయం చేయడంతో నిర్మించుకున్నా. చాలా సంతోషంగా ఉంది. నాకు, మా అమ్మకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. ఏటా రైతు భరోసా కింద రూ. 13,500 జమ అవుతున్నాయి. నా భార్యకు వైఎస్సార్ చేయూత కింద రూ. 18,750 ఇస్తున్నారు. ఏ ప్రభుత్వం పేదలను ఇంతలా ఆదుకోలేదు. – మంగలి సుబ్బరాయుడు, ముక్కమల్ల, సంజామల మండలం



నంద్యాల పవర్ టెంపుల్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

హ్యాపీ న్యూ ఇయర్

నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి మొదలైన సంబరాలు సోమవారంతా కొనసాగాయి. యువత నూతనోత్సాహంతో కేక్‌లు కట్ చేశారు. స్వీట్లు పంచుకుని హ్యాపీ న్యూఇయర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాత్రి చర్చీల్లో ప్రార్థనలు కొనసాగాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు చేరుకుని పూజలు నిర్వహించుకున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల ఇళ్ల వద్ద సందడి నెలకొంది. అభిమానులు, పార్టీ శ్రేణులు తమ నేతలకు బొకేలు, పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లా అధికారులకు ఆయా శాఖల అధికారులు సిబ్బంది కూడా న్యూ ఇయర్ విషెస్ తెలిపారు.

– నంద్యాల(న్యూటౌన్)



కలెక్టర్ మనజీర్‌కు మొక్కను అందజేసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



శ్రీమఠం కారిడార్‌లో భక్తుల సందడి

శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో శ్రీ మఠం పరిసరాలు కళకళలాడాయి. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారుతులు పట్టారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనం దర్శించుకుని పూజలు చేసుకున్నారు. కొత్త సంవత్సరంలో సంతోషంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. భక్తులు రద్దీతో అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాద కౌంటర్లు కిక్కిరిశాయి.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు(ఫ్యామిలీ పెన్షన్) జీవన ప్రమాణ పత్రం(లైఫ్ సర్టిఫికెట్) సంబంధిత సబ్ ట్రెజరీల ద్వారా అప్‌లోడ్ చేయాలని జిల్లా ట్రెజరీ ఉప సంచాలకులు రామచంద్రరావు సోమవారం తెలిపారు. ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులు ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి 29 వరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సంబంధిత సబ్ ట్రెజరీల్లో అందచేయాలని కోరారు.

ఆరోగ్యం.. అ'ద్వితీయం'

- నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2'
- వారానికి మండలంలో రెండు వైద్య శిబిరాలు
- జిల్లా వ్యాప్తంగా 474 శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు



వైద్య శిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

నంద్యాల టౌన్: వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు తదితర విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత విజయవంతం కావడంతో రెండో విడత చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. జనవరి 2వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో వారానికో ఓ గ్రామంలో సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తారు. మండలాన్ని రెండుగా విభజించి ఒక డివిజన్‌లో మంగళవారం, మరో డివిజన్‌లో శుక్రవారం శిబిరాలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి బుధవారం శిబిరాలు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. శిబిరాలకు వచ్చే వారిలో ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఈసీజీ వంటి పరీక్షలు చేసి.. ఉచితంగా మందులు అందజేస్తారు. చికిత్స అవసరమైతే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సంబంధిత వైద్యులు రెఫర్ చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చ్యలు చేపట్టనున్నారు. జూన్ 30 వరకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 474 శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

39 ప్రత్యేక టీమ్‌లు సిద్ధం

'జగనన్న ఆరోగ్య సురక్షఫేజ్–2' కార్యక్రమంలో పేదలకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో 39 వైద్య బృందాలను సిద్ధం చేశారు. ప్రతి శిబిరంలో 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 369 విలేజ్ క్లినిక్స్, 18 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరు నెలల పాటు వైద్య శిబిరాలు నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ప్రతి క్యాంపునకు సంబంధిత పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్ వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందించనున్నారు. ఇప్పటికే వైద్య సిబ్బందికి అవసరమైన శిక్షణ, ప్రచార సామగ్రి, టెస్టింగ్ కిట్లు, మందులు అందించారు.

ఆర్నెల్ల పాటు శిబిరాలు



జిల్లాలో మొదటి విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. అదే స్ఫూర్తితో రెండో విడత నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జనవరి 2వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమై ఆర్నెల్ల పాటు జూన్ 30 వరకు శిబిరాలు కొనసాగుతాయి. ఇప్పటికే కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి పలు సూచనలు చేసి మ్యాపింగ్ చేస్తున్నాం. గత అనుభవాలతో ఎక్కడా సమన్వయలోపం లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

– జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి. శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు పొందవచ్చు. రెండో విడతలో భాగంగా జిల్లాలో మొత్తం 474 శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకు అవసరమైన వైద్యులను నియమిస్తున్నాం. ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, మరో ఇద్దరు స్పెషలిస్టులు ఉంటారు. గైనిక్, పిల్లల వైద్యులు కచ్చితంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైన వారికి పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తాం. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా నెట్వర్క్ ఆస్పత్రులకు సిఫారసు చేస్తాం. – డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, ప్రాజెక్ట్ నోడల్ అధికారి

క్లుప్తంగా

వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఏపీజీబీ సేవలు



ప్రగతి కుబేర డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ పీవీ రమణ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు అందిస్తోందని రీజినల్ మేనేజర్ పివి.రమణ తెలిపారు. సోమవారం కర్నూలు భాగ్యనగర్‌లోని ఏపీజీబీ రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 444 రోజుల కాలపరిమితితో రూపొందించిన ప్రగతి కుబేర డిపాజిట్ స్కీంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీజీబీలో అన్ని రకాల డిజిటల్ సేవలు, అన్ని రకాల రుణాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 60 ఏళ్లలోపు వారికి 7.50 శాతం, మహిళలకు 7.55 శాతం, 60 నుంచి 80 ఏళ్లలోపు వారికి 8 శాతం, మహిళలకు 8.05 శాతం, 80 ఏళ్లు పైబడిన వారికి 8.25 శాతం, మహిళలకు 8.30 శాతం ప్రకారం వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. మారుమూల గ్రామాల ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ఏకైక బ్యాంకు ఏపీజీబీ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు ఆదినారాయణరెడ్డి, రఘు, చంద్రశేఖర్ ఆజాద్, మేనేజర్ రవితేజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో దుర్మరణం



మృతి చెందిన వీఆర్వో వెంకటలక్ష్మమ్మ

ఆళ్లగడ్డ: నంద్యాల - కడప జాతీయ రహదారిపై చింతకొమ్మదిన్నె గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా వీఆర్వో మృత్యువాత పడ్డారు. పడకండ్ల గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ (40) చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామ సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా వేడుకల్లో పాల్గొనేందుకు భర్త అబ్రహంతో కలిసి బైక్‌పై సచివాలయానికి బయలుదేరారు. చింతకొమ్మదిన్నె గ్రామ సమీపంలో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వీఆర్వో వెంకటలక్ష్మమ్మ తీవ్రంగా, అబ్రహంకు స్వల్ప గాయాలయ్యాయి. మహిళా వీఆర్వోను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిన వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి



గొల్ల హరికృష్ణ మృతదేహం

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉప్పల పాడు గ్రామానికి చెందిన గొల్ల హరికృష్ణ (26) అనే వ్యక్తి అల్లూరు గ్రామంలోని పాల కేంద్రం వద్దనున్న బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులోపడి చనిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఆదోని మండలం మండగిరి బీసీ హాస్టల్‌లో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ



నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ ఇచ్చిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సి.బెళగల్ బీసీ హాస్టల్లో విద్యార్థుల నూతన సంవత్సర సంబరాలు



కర్నూలు కలెక్టరేట్ ఎదుట మొక్కలను విక్రయిస్తున్న దృశ్యం



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తన కుమారుడితోపాటు జేసీ మౌర్య కుమారుడితో కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కనుల పండువగా 'నూతన' వేడుక

ఇళ్లను అందంగా అలంకరించారు.. ముంగిట్లో రంగు రంగుల ముగ్గులు వేశారు.. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించారు.. బంధుమిత్రులకు శుభాకాంక్షలు చెబుతూ నూతన ఏడాదికి స్వాగతం పలికారు. హిందువులు ఆలయాలకు వెళ్లి ఇష్ట దైవాలకు పూజలు చేశారు. క్రైస్తవులు చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అభిమానులు ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అధికారులతో కలసి ఆనందంగా గడిపారు. కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సోమవారం 'నూతన' వేడుకలు కనుల పండువగా సాగాయి. –సాక్షి నెట్‌వర్క్



కర్నూలు నగరంలోని జిల్లా కోర్టులో కేక్ కట్ చేసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు తదితరులు



నంద్యాలలో ఎస్పీ రఘువీర్‌రెడ్డికి బొకే అందజేస్తున్న పోలీసు అధికారి



కర్నూలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు



అభిమానుల మధ్య బేతంచెర్లలో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



నంద్యాలలో రెవెన్యూ అధికారుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్





ఆదోని పట్టణం ఆస్పరి రహదారిలో ఉన్న ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు, ప్రార్థన చేయిస్తున్న ఫాదర్ రెవరెండ్ గురెడ్డి విన్నారెడ్డి

పురోభివృద్ధిలో ఏపీజీబీ

– ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్




మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు 2023వ సంవత్సరంలో పురోభివృద్ధిలో పయనించిందని ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని మరియాపురంలోగల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, పొట్టిశ్రీరాములు, నెల్లూరు, బాపట్ల, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 551 శాఖలు, 1182 బిజినెస్ కరస్పాండెంట్లు, 9 ప్రాంతీయ కార్యాలయాలను బ్యాంకు కలిగి ఉందన్నారు. 2023 డిసెంబరు నాటికి రూ. 20,648 కోట్ల డిపాజిట్లు, పోర్టుపోలియో మరియు రూ. 24159 కోట్ల అడ్వాన్సుల పోర్టుపోలియోతో కలిపి రూ.44,808 కోట్ల వ్యాపారం కలిగి ఉందన్నారు. వ్యవసాయం, అనుబంధ, ఎంఎస్ఎంఈ, విద్య, గృహ నిర్మాణం, వాహనం, బంగారు ఆభరణాలు మొదలైన ఉత్పత్తుల కింద రుణాల కోసం బ్యాంకు ఫైనాన్సింగ్ ఇస్తోందన్నారు. డీజీ ఖాతా, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్‌బ్యాంకింగ్, వాట్సాప్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, ఏటీఎం వంటి డిజిటల్ సేవలను కూడా బ్యాంకు అందిస్తోందన్నారు. కార్డులు, మిస్డ్ కాల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏఈపీఎస్, ఎన్ఏసీహెచ్, ఈసీఎస్ ఆదేశాలు, మైక్రో ఏటీఎంలు, ఏటీఎం తదితర వాటి ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్లపై అన్ని ఇతర ప్రభుత్వం, ప్రైవేటు బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ రేటుతో పెరిగిన వడ్డీ రేట్లను ఆయన వివరించారు. బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ ప్రొడెక్ట్ 'ప్రగతి కుబేర్–444'ను సాధారణ ప్రజలకు అత్యధిక వడ్డీ రేటు 7.50 శాతం, మహిళలకు అదనపు వడ్డీ రేటు 0.05 శాతం అందిస్తోందన్నారు. సీనియర్ సిటిజన్లకు 0.50–0.60 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.75 శాతం అదనపు వడ్డీ రేటు ఇవ్వనున్నామన్నారు. అలాగే మహిళా సూపర్ సీనియర్ సిటిజన్లకు కూడా అత్యధికంగా 8.30 శాతం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీఎంలు జగదీశ్వర్‌రావు, పీఆర్ పడ్లేట్వార్, సంజీవప్ప, రంగప్ప బేగర్, పి.రాజేంద్రన్, ఆర్.గిరితోపాటు చీఫ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పును సమర్థించుకునే 'డ్రామా'

- దాతలతో బలవంతంగా దుప్పట్లు ఇప్పించే ప్రయత్నం
- పిల్లల మాటలు విని చలించిపోయినట్లు నిస్సిగ్గు రాతలు
- రామోజీ షో అట్టర్ ఫ్లాప్





డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల,స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

కర్నూలు(అర్బన్): ఆకలైన వారికి అన్నం పెడితే ఎవరైనా వద్దంటారా? కడుపు నిండా భోజనం చేసిన వారిని తిను తిను అంటే ఎలా తింటారు. కర్నూలు డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో గత మూడు రోజులుగా ఇలాంటి పరిస్థితే చోటు చేసుకుంటోంది. ఒకసారి చేసిన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలే తప్ప, తిరిగి పదే పదే అదే తప్పును చేయబోయి 'ఈనాడు' చేతులు కాల్చుకుంటోంది. వండి వార్చిన తప్పుడు కథనాలను సమర్థించుకునేందుకు రామోజీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. గత నెల 30న 'మనసు లేని మామయ్య' శీర్షికన ఈనాడు మొదటి పేజీలో కర్నూలు డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడం వల్ల చలికి గజగజ వణికిపోతున్నట్లు తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే 31వ తేదీన వాస్తవాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం 'సాక్షి' చేసింది. గత డిసెంబర్ 5న ప్రభుత్వం గిరిజన ఆశ్రమ పాఠశాలలకు దుప్పట్లను సరఫరా చేయగా, ఈ పాఠశాలలో 6వ తేదిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా (మొత్తం 90 మంది విద్యార్థులు) దుప్పట్లను పంపిణీ చేశారని, ఆధారాలతో 'సాక్షి'లో 'సిగ్గు సిగ్గు నవ్విపోతారు ... కర్నూలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో రామోజీ షో ' శీర్షికన కథనం ప్రచురితమైంది.

మరో డ్రామాకు తెరలేపిన ఈనాడు

తమ తప్పుడు రాతలను కప్పిపుచ్చుకునేందుకు మరో డ్రామాకు 'ఈనాడు' తెరలేపింది. యుగతులసి ఫౌండేషన్ ద్వారా అదే పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లను అందించేందుకు డిసెంబర్ 31న ప్రయత్నించింది. అయితే తమకు ప్రభుత్వం అందించిన దుప్పట్లు ఉన్నాయని, దాతలు తీసుకొచ్చిన దుప్పట్లను తీసుకునేందుకు విద్యార్థులు తిరస్కరించారు. అనేక రూపాల్లో కాళ్లావేళ్లాపడినా విద్యార్థులు ససేమిరా అన్నారు. జిల్లా కలెక్టర్ ద్వారా చేసిన ప్రయత్నం కూడా ఫలించకపోవడంతో తిరిగి తమదైన శైలిలో 'జగన్ మామ.. ఇదేమి పైత్యం' అంటూ మరో తప్పుడు కథనాన్ని ప్రచురించారు. ఒక్క దుప్పటైనా ఇవ్వండని విద్యార్థులు వేడుకున్నట్లు రాసుకోవడం ఆ పత్రిక పైశాచికత్వానికి నిదర్శనం. రెండు గంటలు వేచి చూసినా, విద్యార్థులు ఎవరు దుప్పట్లు తీసుకునేందుకు ముందుకు రాకపోవడంతో తమ పంతం నెగ్గించుకునేందుకు సమీపంలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలోని విద్యార్థినీలకు దుప్పట్లను పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు.

వేడుకోవడం అవాస్తవం



దుప్పట్ల కోసం యుగతులసి ఫౌండేషన్ ప్రతినిధులను విద్యార్థులు వేడుకోవడం అవాస్తవం. విద్యార్థులకు అవసరమైన దుప్పట్లను ఇప్పటికే పంపిణీ చేశాం. గత ఏడాది నవంబర్ 30న జిల్లాలోని మూడు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు 725 దుప్పట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని డిసెంబర్ 4, 5 తేదీల్లో ఆయా పాఠశాలలకు పంపించాం.

– ఎస్.శ్రీనివాసకుమార్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి, కర్నూలు

అత్యవసర విభాగాల్లో ఇకపై ఆకస్మిక తనిఖీలు

- రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం
- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి



నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, వైద్యులు, ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగాల్లో ఇకపై తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఎవరైనా విధుల్లో లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డికి వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఏఎంసీ తదితర విభాగాల్లో ఇకపై ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. క్యాజువాలిటీ, ఏఎంసీ విభాగాలలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మెడికల్, సర్జరీ, ఆర్థోపెడిక్, అనెస్థీషియా విభాగాలకు సంబంధించి ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఏఎంసీ విభాగంలో అన్ని విభాగాల సూపర్‌స్పెషాలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లను నెలరోజుల పాటు డ్యూటీ రోస్టర్ వేశామని, ఆయా విభాగాలకు సంబంధించిన వైద్యులు వారి రోగులకు చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని గైనిక్, రేడియాలజీ విభాగాలకు సంబంధించి ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా అందుబాటులో ఉండే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. బ్లడ్‌బ్యాంకులో అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ పీజీ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఏడీ అనిల్‌కుమార్, ఏవో శైలజ, అకౌంటెంట్‌లు కుమారస్వామి, లతీఫ్, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

2వేల క్వింటాళ్ల కందుల కొనుగోలు

- ఉమ్మడి జిల్లాలోని 17 డీసీఎంఎస్ బ్రాంచీల ద్వారా సేకరణ



మాట్లాడుతున్న నాఫెడ్ మేనేజర్ వినయ్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): బహిరంగ మార్కెట్ ధరతో ఇప్పటి వరకు జిల్లాలో 2వేల క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లుగా నాఫెడ్ జిల్లా మేనేజర్ వినయ్‌కుమార్ తెలిపారు. మార్కెట్ ధరకు అనుగుణంగా రాష్ట్రంలో 50వేల టన్నుల కందులు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం స్థానిక డీసీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో కందుల కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. నాఫెడ్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాల కోసం నాఫెడ్ దేశ వ్యాప్తంగా బహిరంగ మార్కెట్ ధర ప్రకారం కందులు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని డీసీఎంఎస్ అన్ని బ్రాంచీల ద్వారా కందులు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎకరాకు గరిష్టంగా 6 క్వింటాళ్ల వరకు కందులు కొంటామని, అయితే తగిన నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని సూచించారు. డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ మార్కెట్ ధరతో కందులు అమ్ముకునేందుకు రైతులు వెంటనే సంబంధిత బ్రాంచ్ మేనేజర్లను కలసి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఉంగరానిగుండ్లలో ఘర్షణ

- యువకుడి మృతి
- ఏడుగురికి తీవ్ర గాయాలు
- హైవేపై మృతుడి కుటుంబీకుల ఆందోళన
- 12 మందిపై హత్య కేసు నమోదు



రోడ్డుపై బైటాయించిన మృతుని బంధువులు



మృతి చెందిన ఖాదర్ (ఫైల్)

డోన్ రూరల్: ఉంగరానిగుండ్ల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడు కుటుంబీకులు న్యాయం చేయాలంటూ సోమవారం కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేయడంతో దాదాపు రెండు గంటల పాటు ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. డోన్ పట్టణంలోని చిగురుమాన్‌పేటకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఏడేళ్లుగా ఉంగరానిగుండ్ల గ్రామంలో ఇల్లు కట్టుకుని కుటుంబంతో నివాసముంటున్నాడు. అయితే ఆ గ్రామానికి చెందిన కొందరు లక్ష్మీనారాయణను ఊరి వదిలి వెళ్లాలని పలుమార్లు చెప్పారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి లక్ష్మీనారాయణ కుటుంబానికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పడానికి వారి బంధువులు రవి, నాని గ్రామంలోకి వస్తుండగా గ్రామానికి చెందిన కొందరు యువకులు అడ్డుకున్నారు. వారి మధ్య వాగ్వాదం జరగడంతో రవిపై దాడి చేశారు. పక్కనే ఉన్న నాని అక్కడి నుంచి పరారయ్యాడు. రవిపై దాడి చేసిన యువకులు నేరుగా ఉంగరానిగుండ్లలోని లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి చేసి వస్తువులను ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన కుటుంబీకులను కట్టెలతో, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో మొత్తం ఏడుగురు గాయపడగా వారిలో లక్ష్మీనారాయణ కుమారుడు ఖాదర్(25)కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఓబులేష్, సిసింద్రీ, నవీన్, చిన్న, మధు, అబ్దుల్, ఖాజా, అహమ్మద్, షరీఫ్, మనోహర్, పవన్, చిన్నమద్దిపై హత్య కేసు, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు.

ఆందోళన.. ఉద్రిక్తత

ఖాదర్ మృతితో కుటుంబీకులు, బంధువులు సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కర్నూలు - బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. హత్యకు పాల్పడిన వారిని తమకు అప్పగించాలని భీష్మించి కూర్చున్నారు. లేకపోతే సామూహికంగా ఆత్మహత్య చేసుకుంటామని కిరోసిన్ కూడా పోసుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు అప్రమత్తమై వారు నిప్పు అంటించకుండా కాపాడారు. నిందితులకు కఠినంగా శిక్షిస్తామని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆందోళనకారులకు నచ్చచెప్పడంతో శాంతించారు.